క్లుప్తంగా

కళలను ఆదరించాలి


'ఫా' క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

సీతంపేట: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రా ఆర్టిస్ట్స్(ఫా) రూపొందించిన 2023 టేబుల్ టాప్ క్యాలెండర్‌ను శంకరమఠంలో సోమవారం కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆవిష్కరించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫా డైరెక్టర్ సన్‌మూర్తి కోరిక మేరకు స్వామీజీ క్యాలెండర్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం సుభిక్షంగా ఉండాలంటే కళలను ఆదరిస్తూ కళాకారులకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. భక్తి పారవశ్యంలో తరించేందుకు భక్తి సంగీతం, వాద్య పరికరాలు స్వాంతన ఇస్తాయన్నారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో జెడ్సీ తనిఖీలు


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

సీతంపేట: సచివాలయ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అన్నారు. 43వ వార్డు నందగిరినగర్, తాటిచెట్లపాలెం సచివాలయాల్లో సోమవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సచివాలయాల్లో రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో గృహ నిర్మాణం, యూజర్ చార్జీల వసూలు, ఎస్ఎల్‌పీ ఫిర్యాదులు, వివిధ సంక్షేమ పథకాలు, ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం అమలు, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాల అమలు తీరుపై సంబంధిత కార్యదర్శులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై సిబ్బందికి జెడ్సీ సూచనలిచ్చారు.

పెన్షనర్లకు సౌకర్యాలు


పెన్షనర్లకు సూచనలిస్తున్న కార్యాలయ అధికారి గోవిందరావు

సీతమ్మధార: సీతమ్మధార ఉప ఖజానా కార్యాలయంలో పెన్షనర్ల కోసం మౌలిక సదుపాయాలు కల్పించారు. వృద్ధ పింఛన్‌దారులు కూర్చునేందుకు కుర్చీలు, టేబుళ్లు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారి గోవిందరావు మాట్లాడుతూ పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారికి అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. ఆరోగ్య కారణాల వల్ల రాలేని పింఛన్‌దారులకు ఉప ఖజానా కార్యాలయం నుంచి సిబ్బందిని వారి ఇళ్లకు పంపించి వివరాలు సేకరించి పెన్షన్ అందిస్తామన్నారు. పెన్షనర్లకు పలు సూచనలు చేశారు. అధికారులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు మహేష్ ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఓం నమో నారాయణాయ

- వైష్ణవాలయాల్లో వైభవంగా ఉత్తర ద్వార దర్శనం
- దేవదేవుడిని దర్శించి తరించిన భక్తజనం


గరుడ వాహనంపై విశేష అలంకరణలో లక్ష్మీప్రసన్న వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లు

సీతంపేట: ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం గోవింద నామస్మరణతో వైష్ణవాలయాలు మార్మోగాయి. వైకుంఠుడి దర్శనం కోసం ప్రధాన ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఉత్తర నియోజకవర్గంలోని పలు వైష్ణవాలయాల్లో వేకువజాము 4 గంటల నుంచే భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. శ్రీమన్నారాయణుడిని కనులారా దర్శించుకుని భక్తజనం తరించారు.

లలితా పీఠంలో..

అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో ఉత్తర ద్వార దర్శనం వైభవోపేతంగా జరిగింది. భూలోకం, భువర్లోకం, స్వర్గలోకం, మహర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం ఇలా ఏడు ద్వారాలు దాటి పద్మావతి, అలమేలు సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించి ఊయల కింద నుంచి వెళ్లి శ్రీవారికి భక్తులు పూజలు చేశారు. అనంతరం పీఠంలోని సమస్త దేవతలను దర్శించుకున్నారు. ధనుర్మాస వ్రత నిత్యకైంకర్య సేవలతోపాటు ఊంజల్ సేవ, చందన అలంకరణతో స్వామి వారి దర్శనం కల్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరాలయంలో..

అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం, మండపాన్ని పూలమాలలు, స్వీట్‌కార్న్, పలు రకాల పండ్లతో చూడముచ్చటగా అలంకరించారు. ఆలయ మండపంలో పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వేంకటేశ్వరుడు గరుడ వాహనంపై విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కూర్మనాథాచార్యులు స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, సహస్రనామార్చన, నక్షత్ర హారతులు ఇచ్చారు. భక్తులు అభిషేకాలు జరిపారు.

- అక్కయ్యపాలెం మూడుగుళ్ల వద్ద వేంకటేశ్వర స్వామి ఆలయం, గోకులపాలెం రామాలయం, సీతంపేట రాధాకృష్ణ ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ప్రసన్న వెంకన్నకు ప్రత్యేక పూజలు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా దేవాలయానికి భక్తులు పోటెత్తారు. ఉత్తర ద్వారం గుండా వెంకన్నను దర్శించి విశేష పూజలు నిర్వమించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పలు రకాల పువ్వులతో స్వామిని అలంకరించారు.

వైభవుడి ఆలయంలో భక్తజన సందోహం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శనాలకు సుమారు 25 వేల మంది భక్తులు తరలివచ్చారు. లా అండ్ ఆర్డర్ సీఐ విజయకుమార్, ట్రాఫిక్ సీఐ మల్ల అప్పారావుల పర్యవేక్షణలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో వాసుదేవాచార్యులు, శేషాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 300 మంది వలంటీర్లు నిరంతరం క్యూలైన్ల వద్ద ఉండి భక్తుల దర్శనాలకు సహకరించారు. ప్రసాదాలు, తాగునీరు అందించారు. మూడు వైద్య శిబిరాలు నిర్వహించారు.

ప్రముఖుల రాక..

వైభవ వేంకటేశ్వర స్వామిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, విశాఖ–కాకినాడ పెట్రోకారిడార్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, కంకటాల సిల్క్స్ అధినేత మల్లిక్, ఉత్తర, పశ్చిమ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు, వీఎంఆర్డీఏ కార్యదర్శి, ఏసీపీ వివేకానంద, జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ రవికుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు లాలం భాస్కర్, టీడీపీ ఉత్తర ఇన్‌చార్జి చిక్కాల విజయ్‌బాబు, పార్లమెంట్ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్, పలువురు కార్పొరేటర్లు దర్శించుకున్నారు. ప్రోటోకాల్ ప్రకారం వీరిని ఈవో బండారు ప్రసాద్, వాసుదేవాచార్యులు, శేషాచార్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కోలాటాలు, అన్నమాచార్య కీర్తనలు అలరించాయి.


శ్రీనివాసనగర్‌లో లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరాలయం వద్ద బారులు తీరిన భక్తులు

సంప్రదాయబద్ధంగా..

మురళీనగర్ రామాలయంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఉత్తర ద్వారం దర్శనంలో సీతారామలక్ష్మణులకు తులసీదళాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యదర్శి సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. పట్టాభిరెడ్డితోట దాసాంజనేయ స్వామి ఆలయంలో ఆరవిల్లి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు చేశారు. దాసాంజనేయస్వామి బంగారు కవచధారుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యానగర్-2లో వెలసిన యోగసిద్ధాంజనేయ ఆలయంలో స్వామిని వైకుంఠ నారాయణోపాస మారుతిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.


నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

కలియుగ వెంకన్నకు పంచామృతాభిషేకాలు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తి వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి జగన్నాథశర్మ, శంకరశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము 4 గంటలకు గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు దంపతులు కలశ ప్రతిష్ఠ, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

వైకుంఠుడి దర్శనం.. మహా పుణ్యఫలం

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆర్ అండ్ బీ దరి హైవే పక్కన అప్పయ్యనగర్‌లో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనాలు కల్పించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ స్వామిని దర్శించుకున్నారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మాధవ స్వామి ఆలయంలో..

మాధవధార మాధవ స్వామి ఆలయంలోని లీలా మాధవ స్వామికి వంశపారంపర్య అర్చకుడు సనపల శ్రీనివాసం, సనపల రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైకుంఠ ఏకాదశి పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. పాశురం విన్నవించి హారతులిచ్చారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.


వైభవుడి ఆలయంలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, కంకటాల సిల్క్స్ అధినేత మల్లిక్


కె.కె.రాజును సత్కరిస్తున్న నిర్వాహకులు


తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వరుడి సన్నిధిలో అర్చకులు, భక్తులు


లలితా పీఠంలో ఊయలపై ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి


పట్టాభిరెడ్డితోటలో సీతారామలక్ష్మణుల దర్శనం


భూ సమేత వెంకన్నను దర్శించుకుంటున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


అప్పయ్యనగర్‌లో వేంకటేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు


వైభవుడి ఆలయంలో కోలాటమాడుతున్న మహిళలు


లలితా పీఠంలో చందన అలంకరణలో వేంకటేశ్వర స్వామి


మురళీనగర్ రామాలయంలో సీతారామలక్ష్మణులకు పూజలు చేస్తున్న భక్తులు

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు..'


ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లుకు సూచిస్తున్న కె.కె. రాజు

తాటిచెట్లపాలెం: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం 55వ వార్డు 250 సచివాలయం పరిధి గవర తాటిచెట్లపాలెం, సంతోషిమాత ఆలయం వీధి, రెడ్డి తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో కార్పొరేటర్ శశికళతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించి, స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఏదైనా సమస్యలుంటే సచివాలయం సిబ్బంది, కార్పొరేటర్ లేదా తన దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. సీఎం వైఎస్ జగన్ పరిపాలనలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. చంద్రబాబు అండ్ కో చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మడం లేదన్నారు. జగనన్న పాలనలో క్షేత్రస్థాయిలో ప్రతి లబ్ధిదారుడి ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయని చెప్పారు. కొన్ని సమస్యలను అక్కడే గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ఆయన సూచించారు. కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, కె.అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, పార్టీ వార్డు అధ్యక్షులు కె.పి.రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాస్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు రాయుడు శ్రీను, నార్త్ బీసీ సెల్ అధ్యక్షుడు బొడ్డేటి గంగామహేష్, పార్టీ నాయకులు ఆళ్ల శ్రీనివాస్, వైపీఎన్ రాజు, ఆళ్ల గోపి, యర్రంశెట్టి శ్రీనివాస్, ఎడ్ల శ్రీనవాస్‌రెడ్డి, ఆళ్ల గోపి, సురేష్, యండి గౌస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


విద్యార్థినికి ట్యాబ్ అందజేస్తున్న కె.కె.రాజు, బానాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు సోమవారం బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావుతో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి చదువుకోవాలన్న తపన ఉన్న ప్రతి విద్యార్థికి ఉన్నత విద్య వరకు ప్రభుత్వమే చేయూతనివ్వాలని సంకల్పించారన్నారు. దానిలో భాగంగా విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకొచ్చి నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ విద్యను చేరువ చేశారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టి.శాంతికుమారి, వార్డు నాయకులు హీర, సోఫియా, గోపి, మంజుల, సీతారాములు, రామారావు, ఎం.రాంబాబు, బేగం, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాలులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


జైభారత్‌నగర్‌లో శంకుస్థాపన చేస్తున్న కెకె.రాజు, కార్పొరేటర్ కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు జైభారత్‌నగర్, ఇందిరానగర్ కొండవాలు ప్రాంతంలో రూ.20 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు.. కార్పొరేటర్ గంకల కవితతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నారన్నారు. దీనిలో భాగంగా వార్డుల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి పనులు వేగవంతం చేశారని చెప్పారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు చేరేలా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 48వ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, గంకల అప్పారావు, కర్రి రామారెడ్డి, జోన్-5 ఇంజినీరింగ్ డీఈ భరణికుమార్, ఏఈ అర్చన, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆనందమని'పించన్'


14వ వార్డులో పెన్షన్లు అందజేస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు


45వ వార్డులో పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు, సిబ్బంది, కన్వీనర్లు


49వ వార్డులో పెన్షన్ సొమ్ము అందిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులో సోమవారం సచివాలయ సిబ్బందితో కలిసి కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు కొత్త పెరిగిన పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్, సీతమ్మధార తదితర ప్రాంతాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర, విశాఖ నగర అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

అవ్వాతాతల ఆనందం

మద్రిపాలెం: జీవీఎంసీ 49వ వార్డు కార్యాలయంలో లబ్ధిదారులకు డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు పింఛన్లు పంపిణీ చేశారు. పెరిగిన రూ.2,750 పెన్షన్ అందుకున్న అవ్వాతాతలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

53 మందికి మంజూరు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులో కొత్త పింఛన్లను డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు చేతుల మీదుగా పంపిణీ చేశారు. తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల 256 సచివాలయంలో అన్ని సచివాలయాలకు సంబంధించి కొత్తగా 53 మంది లబ్ధిదారులకు మంజూరైన పింఛన్లను అందజేశారు. సుమారు 2 నెలలుగా పింఛన్ సొమ్ము నిలిచిపోయిన 256 సచివాలయానికి చెందిన మొగులిశెట్టి అప్పయ్యమ్మకు కార్పొరేటర్ హనోకు తన సొంత నిధుల నుంచి ఒక నెల పింఛన్‌ను ఆర్థిక సాయంగా అందించారు. ఆమెకు త్వరగా పింఛన్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని సెక్రటరీకి ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, కన్వీనర్లు, పార్టీ నాయకులు హరిపట్నాయక్, రాజుయాదవ్, బాబూరావు, సన్యాసప్పలనాయుడు, సన్నీ, దుర్గేష్, నర్సింగ్, గోవింద్, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు దేవి, శోభన్, నాగేశ్వరరావు, రంగా, కమల, కాలనీ పెద్దలు నరసా రావు, మల్లీశ్వరరావు, సత్తిబాబు, వలంటీర్లు పాల్గొన్నారు.

'స్పందన'కు 15 అర్జీలు


అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 15 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. డిప్యూటీ తాహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల అందజేత


లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ కామేశ్వరి

కంచరపాలెం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా 47వ వార్డు రాంజీ ఎస్టేట్ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అక్కచెల్లెమ్మలకు సొంత గూడు అందించే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో ఆయనకు మహిళలంతా మద్దతు పలకాలని కోరారు. లబ్ధిదారులకు రూ.1.80 లక్షల ఆర్థిక సాయంతోపాటు ఉచితంగా ఇసుక అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు కోరిబిల్లి విజయ్, వి.అప్పారావు, కంటిపాము గురువోజీ, వీరరాఘవులు, సుకుమార్, కృపా, ఎస్.జయకుమార్, అనిల్, చందు, ఎం.రమణ, అజయ్, వాసు, భారత్, సవరపు జయ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య


పాండ్రంగి తులసి మృతదేహం

మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మురళీనగర్ సుదర్శన్ పార్కు వద్ద తల్లిదండ్రులతో కలిసి పాండ్రంగి తులసి(25) నివసిస్తోంది. యువతి తండ్రి పాండ్రంగి రమణ ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే సోమవారం ఉదయాన్నే తల్లిదండ్రులిద్దరూ వారి పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి కూతురు తులసి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని విగతజీవిగా పడి ఉంది. వారికి ఇద్దరు కుమార్తెలు. ఆత్మహత్య చేసుకున్న రెండో కుమార్తె వర్మ కాంప్లెక్స్ దరి బీ ట్రీట్స్‌లో పనిచేస్తోంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ప్రేమ వ్యవహారమా లేక వేరే ఏమైనా కారణాలు ఉన్నాయా అన్న కోణంలో సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.